
సాక్షి
అనంతపురం
బుధవారం । 7 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



'తపాలా'లో బదిలీలకు గ్రహణం

తపాలా శాఖలో ఉద్యోగుల బదిలీలు ముందుకు సాగలేదు. కొత్త సూపరింటెండెంట్ అయినా దీనిపై దృష్టి సారించాలి. IIలో

గరిష్టం/కనిష్టం
41.7°/24.9°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.15,848 కోట్లు



రుణ ప్రణాళిక పత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

అనంతపురం సిటీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)కు సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.15,848 కోట్లుగా పెట్టుకున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన డీసీసీ/డీఎల్ఆర్‌సీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లతోపాటు అన్ని వర్గాలు, అన్ని రంగాలకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆమె వెల్లడించారు. అందులో పంట రుణాల కింద రూ.7,742 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాల కింద రూ.3,310 కోట్లు, పరిశ్రమ, సేవా రంగాలకు రూ.1962 కోట్లు, గృహ రుణాలకు రూ.280 కోట్లు ఇవ్వాలని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ, ఇతర ప్రాధాన్య రంగాల కింద రూ.647 కోట్లు, అప్రాధాన్యత రంగాల కింద రూ.2188 కోట్లు ఇవ్వాలని నిర్ణయించామని ఎల్‌డీఎం తెలిపారు. బ్యాంకర్లు, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు



ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో చైన్ స్నాచర్ల ఆగడాలకు క్లాం వేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రజల కష్టాన్ని దొంగలు దోచుకుపోకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి దాకా జరిగిన చోరీల కేసుల్లో పురోగతి సాధించి రికవరీలు పెంచాలన్నారు. చాలా కాలంగా నేర నియంత్రణకు పాటుపడే క్రైం పార్టీలు లేకపోవడంతో నేరాల సంఖ్య పెరిగిన మాట వాస్తవమేనని ఎస్పీ అన్నారు. ఇక స్టేషన్‌కు ఒక క్రైం పార్టీ ఏర్పాటు చేస్తే రికవరీలు జరుగుతాయన్నారు. అనంతపురంతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులపై ఎస్పీ ఆరా తీశారు. సీసీఎస్, క్రైం పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో వాటిని ఛేదించాలన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌కు జాతీయస్థాయి అవార్డు



అవార్డును అందుకుంటున్న పొట్లూరు మంజు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ పొట్లూరు మంజు జాతీయస్థాయిలో ఫ్లోరెన్స్‌నైటింగేల్ అవార్డును అందుకున్నారు. నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బెంగళూరులోని రవీంద్రభారతిలో మానవతా దృక్పథంతో అందిస్తున్న సేవలకు మదర్ థెరిస్సా అవార్డు, నర్సింగ్ సేవలకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు జాతీయస్థాయి ఫోరెన్స్ నైటింగేల్ అవార్డును ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. నర్సింగ్ రంగంలో సేవలందించినందుకు లభించిన ఈ అవార్డుపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

వెటర్నరీ అంబులెన్స్‌లో ఉద్యోగావకాశాలు



అనంతపురం అగ్రికల్చర్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్) వాహనాల పరిధిలో ఖాళీగా ఉన్న పైలట్లు (డ్రైవర్లు), పశువైద్యులు, పారాస్టాఫ్ పోస్టుల కోసం అర్హత, ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని ఇన్‌చార్జ్ ముస్తాక్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1962 హెల్ప్‌లైన్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులేటరీ వాహనాలు సేవలు అందిస్తున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 81256 38308, 91549 70184 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అప్పుడంతా అవినీతి బాటే





మాట్లాడుతున్న 'దిశ' కమిటీ చైర్మన్, ఎంపీ తలారి రంగయ్య. చిత్రంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, హాజరైన ఎమ్మెల్యే అనంత, అధికారులు, కమిటీ సభ్యులు

- టీడీపీ హయాంలో భారీగా అక్రమాలు
- యథేచ్ఛగా 'ఉపాధి' నిధుల దోపిడీ
- ఫారంపాండ్లు, ఇంకుడు గుంతల్లో అవినీతి ప్రవాహం
- వాటర్‌షెడ్లలో స్వచ్ఛంద సంస్థలు రూ.కోట్లు దోచుకుంటే వదిలేస్తారా?
- 'దిశ' సమావేశంలో ఎంపీ రంగయ్య, విప్ కాపు, ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

> ఉమ్మడి జిల్లాలో బాలికలు, మహిళలు అదృశ్యమవుతున్నారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' వంటి పథకం కింద ఏటా కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నా వాటిని ఎందుకు ఖర్చు చేయలేకపోతున్నారు. ఐసీడీఎస్ అంటే కేవలం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, కోడిగుడ్ల పంపిణీ మాత్రమే కాదు. ఆడపిల్లల మనుగడ, రక్షణ, చదువుకు భరోసా ఇవ్వాలి.
> – ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవికి ఎమ్మెల్యే అనంత హితవు

అనంతపురం సిటీ : టీడీపీ హయాంలో అమలు చేసిన పలు పథకాల్లో జరిగిన నిధుల దోపిడీపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారో అధికారులు సమాధానం చెప్పాలని ప్రజాప్రతినిధులు పట్టుబట్టారు. ప్రభుత్వం మారి నాలుగేళ్లు పూర్తయినా అక్రమార్కుల విషయంలో ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని నిలదీశారు. 'చంద్రన్న బాట కింద రోడ్లు వేయకనే బిల్లులు చేసుకున్నారు. ఫారంపాండ్లు, ఇంకుడు గుంతలు తవ్వకనే డబ్బులు డ్రా చేసుకున్నారు. అక్రమాలపై విచారణ నివేదికలు ఏమయ్యాయో అంతుబట్టడం లేదు. చెక్‌డ్యాంల పేరిట స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులూ రూ.కోట్లకు కోట్లు మింగేశారు. వారిని శిక్షించాల్సిందిపోయి.. వదిలేస్తే ఎలా? మీ వల్ల కాకపోతే నివేదికలు మాకివ్వండి. క్షేత్రస్థాయిలో వెళ్లి మేమే నిగ్గుతేలుస్తాం' అంటూ అధికారులకు చురకలంటించారు. ఇందుకు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం వేదికైంది. సమావేశం ప్రారంభం నుంచి ముగిసే వరకు వాడీవేడిగా కొనసాగింది. 'దిశ' కమిటీ చైర్మన్, ఎంపీ తలారి రంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ గౌతమి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ప్రశాంత్ కుమార్, కుశాల్ జైన్ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

'ఉపాధి' కుంభకోణంపై మండిపాటు

టీడీపీ హయాంలో అంటే 2014 నుంచి 2019 వరకు జిల్లాలో ఉపాధి పనుల్లో జరిగినంత దోపిడీ రాష్ట్రంలో మరెక్కడా జరగలేదని ఎమ్మెల్యే అనంత మండిపడ్డారు. చంద్రన్నబాట పేరుతో కొన్ని చోట్ల నాసిరకం పనులు చేయగా, అత్యధిక ప్రాంతాల్లో రోడ్లు వేయకనే వేసినట్లు రికార్డులు సృష్టించి రూ.కోట్లు దిగమింగారని అనంత ఆరోపించగా, విప్ కాపుతో పాటు మరికొందరు సభ్యులు కూడా గొంతు కలిపారు. 'లక్ష ఫారంపాండ్లు తవ్వినట్లు గొప్పలు చెప్పి, అవార్డులు సైతం పొందారు. ఇంకుడు గుంతలదీ అదే పరిస్థితి. పంచాయతీ కార్యదర్శులను టీడీపీ నేతలు బెదిరించి దొంగ బిల్లులు చేసుకున్నారని' విప్ కాపు ఆరోపించారు. వాటర్‌షెడ్లలోనూ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రూ. కోట్లు కొట్టేశారని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నిస్తే అధికారుల నుంచి మౌనమే సమాధానమైంది. ఉపాధి నిధులు రూ.18 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి, ఎందుకని అడిగితే సరైన సమాధానమే చెప్పలేకపోతున్నారన్నారు. నీరు–చెట్టు కింద తమ మండలంలోని ఓ పంచాయతీలో రూ.3 కోట్లు టీడీపీ నేతలు అక్రమంగా డ్రా చేసుకున్నారని బెళుగుప్ప జెడ్పీటీసీ సభ్యురాలు మమత సభ దృష్టికి తెచ్చారు. టీడీపీ హయాంలో రైతులకు పంపిణీ చేయాలని తెచ్చిన రెయిన్ గన్లన్నీ ఆ పార్టీ నేతల ఇళ్లల్లోనే ఉండిపోయాయని సభ్యులు ఆరోపించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఏడాదికి వంద రోజులకు మించి పనులు కల్పించలేకపోతున్నారని ఎమ్మెల్యే అనంత ధ్వజమెత్తారు. డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి స్పందిస్తూ సాఫ్ట్‌వేర్ సమస్యతో 90 రోజులకు మించి కుదరడం లేదని తెలిపారు.

వాస్తవాలు బహిర్గతం చేయండి

ఏ పథకం అమలు విషయమైనా నిధులు విడుదలైన వెంటనే పత్రికల్లో రాయిస్తే అందరికీ తెలుస్తుందని కలెక్టర్ గౌతమి అన్నారు. లేకుంటే నిధులే విడుదల కావడం లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతాయన్నారు. పత్రికల్లో వ్యతిరేక కథనాలు వచ్చినప్పుడు అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలు బహిర్గతం చేయాలన్నారు.

> నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్‌తో పాటు ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులు భారీగా పెంచి దోపిడీ చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లలో పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించినా ఎందుకు అమలు కావడం లేదు?
> – విద్యాశాఖ అధికారులను నిలదీసిన 'దిశ' కమిటీ సభ్యులు

రోడ్లపై పంటలు ఆరబెట్టరాదు



రైతులకు మేం వ్యతిరేకం కాదు. పండిన పంటలను రోడ్లపై ఆరబెట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 108 అంబులెన్స్‌లు సైతం సకాలంలో ఆస్పత్రులకు చేరుకోలేకపోతున్నాయి. రోడ్లపై కాకుండా ఖాళీ ప్రదేశాల్లో పంటలు ఆరబెట్టుకునేలా చూడాలి.
– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

సమష్టిగా పేదలకు మేలు చేద్దాం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను నిరుపేదల చెంతకు తీసుకెళ్లి, వాటి ఫలాలు వారికి అందేలా సమష్టిగా కృషి చేద్దాం. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారం, సమన్వయంతో పని చేసి, జిల్లాను ప్రగతి పథంలో అగ్రభాగాన నిలుపుదాం.
– తలారి రంగయ్య, 'దిశ' చైర్మన్

ప్రజాధనం దుర్వినియోగం కారాదు



ప్రతి పైసా విలువైనదే. ప్రజాధనం దుర్వినియోగం కావడానికి వీల్లేదు. వాటిని దుర్వినియోగం చేసే వారు ఎంతటి వారైనా గుర్తించి, శిక్షించాలి. అప్పుడే మరొకరిలో భయం మొదలవుతుంది. లేదంటే ఈ దోపిడీ ఇలాగే కొనసాగుతూ ఉంటుంది. నిధులను స్వాహా చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆలోచన విధానంలోనూ మార్పు రావాలి. అప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుంది.
– అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, అనంతపురం అర్బన్

కిశోర బాలికల్లో అవగాహన కల్పించాలి



గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని కిశోర బాలికలకు అవగాహన కల్పించేవారు. ఇప్పుడు అటువంటి కార్యక్రమాలు అమలు కావడం లేదు. దీంతో బాలికలకు మాయమాటలు చెప్పి అదృశ్యం చేస్తున్నారు. బాలికల్లో ఎదుగుదలతో పాటు వచ్చే మార్పులు, గడప దాటితే ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించాలి. వారిలో చైతన్యం తీసుకురావాలి. అప్పుడే సత్ఫలితాలు ఉంటాయి.
– బోయ గిరిజమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

మందు పార్టీపై ఉన్నతాధికారుల సీరియస్

కణేకల్లు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరిగిన మందు పార్టీ వైరల్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. రాత్రి పూట బయటి వ్యక్తులొచ్చి మందు పార్టీతో ఎంజాయ్ చేయడమేంటని అధికారులు షాక్‌లో ఉండిపోయారు. ఉద్యోగులు చనువిస్తే గానీ బయటోళ్లు, ప్రయివేటు వర్కర్లు రారని ఓ నిర్ణయానికొచ్చిన అధికారులు ఇక్కడ ఎవరు చక్రం తిప్పుతున్నారో ఆరా తీస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాన్ని రాత్రిపూట పూర్తిగా తన కంట్రోల్‌లోకి తీసుకొని ఎవరో ఒకరు మందుపార్టీలిస్తున్నారని, ఆ పార్టీలకు ప్రయివేటు వర్కర్లు కూడా వచ్చి కూర్చొని ఎంజాయ్ చేస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. రాత్రి పూట తమ ఉద్యోగులకు కాకుండా బయటోళ్లకు ఇక్కడేం పని? దేని కోసం వారంతా వస్తున్నారు? బయటోళ్లు మందుపార్టీలు చేసుకొనేందుకు వీరెందుకు అవకాశమిస్తున్నారు? మందుకు కక్కుర్తి పడ్డారా? ఇంకేదైనా ఉందా? అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. మందుపార్టీలకు ప్రధానసూత్రధారి హెచ్‌వీడీఎస్ కాంట్రాక్టరేనని అధికారులు గుర్తించినట్లు సమాచారం. తనకు సీఎండీ మొదలు ఎస్ఈ, ఈఈ, డీఈఈలందరూ తెలుసని... తాను కూడా డిపార్ట్‌మెంట్ మనిషే అని చెప్పుకొంటున్న కాంట్రాక్టర్ వాళ్ల పేర్లు ఉపయోగించుకొని ఇక్కడ సిబ్బందిని తన గుప్పిట్లో పెట్టుకొన్నట్లు సమాచారం. పెద్దోళ్లంతా బాగా తెలుసన్న కాంట్రాక్టర్ పార్టీ పెట్టుకొంటానంటే ఎందుకు వద్దనాలి? వద్దంటే తమకెక్కడ సమస్య తెచ్చి పెడతాడోననే భయంతో ఉద్యోగులు తలూపినట్లు స్థానిక ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.



సస్పెండైన లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావును విచారణ చేస్తున్న ఏడీ శ్రీనివాసనాయుడు

సబ్‌స్టేషన్‌లో ఏడీ విచారణ

కణేకల్లు సబ్‌స్టేషన్‌లో మందు పార్టీ ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాసనాయుడు మంగళవారం విచారణ చేపట్టారు. తొలుత సస్పెండ్ అయిన లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావును విచారణ చేశారు. అనంతరం ఆ సమయంలో డ్యూటీలో ఉన్న ఆపరేటర్ రాజశేఖర్‌ను కూడా విచారించి ఇక్కడేం జరిగింది? మందుపార్టీ ఎవరిచ్చారు? దేనికోసం ఇచ్చారంటూ? ఆరా తీశారు. మందుపార్టీ నిర్వహించిన కీలక వ్యక్తి కాంట్రాక్టర్ దేవరాజ్‌ను కూడా ఏడీ సుదీర్ఘంగా విచారణ చేశారు. ఇదే పార్టీలో పాల్గొన్న మల్లికార్జున, ఇలియాజ్‌తోపాటు ఒకరిద్దరు ప్రయివేటు వ్యక్తులను కూడా విచారించారు. మందుపార్టీకి అభ్యంతరం ఎందుకు చెప్పలేదంటూ ఆపరేటర్ రాజశేఖర్‌ను ప్రశ్నించారు. ప్రతి ఒక్కరి నుంచి రాత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఇక్కడ ఎవరెంత సేపు సమయం కేటాయించారని పలువురు లైన్ ఇన్‌స్పెక్టర్లను ఆరా తీశారు. విచారణ నివేదికను ఈఈ శేషాద్రిశేఖర్‌కు సమర్పిస్తామని ఏడీ విలేకర్లకు తెలిపారు.

జేవీకే కిట్ల సరఫరా బాధ్యత ఎంఈఓలదే



మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను మండలాల నుంచి స్కూళ్లకు సరఫరా చేయాల్సిన బాధ్యత మండల విద్యాశాఖ అధికారులదేనని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లాలోని ఎంఈఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. డీఈఓ మాట్లాడుతూ మండలాలకు వచ్చే జేవీకే కిట్ల వస్తువులను వెంటనే స్కూళ్లకు పంపాలన్నారు. ఏ ఒక్క వస్తువూ మండల కేంద్రాల్లో ఉండకూడదని స్పష్టం చేశారు. స్కూళ్ల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి జేవీకే కిట్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలసత్వంగా ఉంటూ అనవసరంగా సమస్యలు కొని తెచ్చుకోవద్దన్నారు. స్కూల్ పాయింట్లకు చేరిన వస్తువలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తప్పిదాలు చేస్తే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రారంభం నుంచే ప్రత్యేక ప్రణాళికతో అమలు చేస్తే కచ్చితంగా మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు.

ఇష్టానుసారంగా ఫైళ్లు పెడితే కుదరదు

ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యూవల్స్ ఫైళ్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి పెట్టాలని ఎంఈఓలకు డీఈఓ సూచించారు. మౌలిక వసతులు లేకపోయినా ఫైళ్లు పెడితే సంబంధిత ఎంఈఓలపై కఠిన చర్యలుంటాయన్నారు. పెన్షన్ రాకుండా చేస్తానని హెచ్చరించారు. చాలామంది టూర్ ప్రోగ్రామ్‌లు, డైరీలు రాయడం లేదన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో గుత్తి డీవైఈఓ శంకర ప్రసాద్, ఏపీఓ నాగరాజు, అసిస్టెంట్ సీఎంఓ గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

ముగిసిన హెచ్ఎంల వెబ్ ఆప్షన్లు

- నేటితో స్కూల్ అసిస్టెంట్ల ఆప్షన్లు పూర్తి
- ఎస్జీటీలకు రేపటి దాకా అవకాశం

రాప్తాడు రూరల్: ఉపాధ్యాయ బదిలీల ఘట్టం చివరి దశకు చేరుతోంది. కీలకమైన ఆప్షన్ల ప్రక్రియ మొదలైంది. మంగళవారం సాయంత్రం 7.30 గంటల సమయానికి ప్రధానోపాధ్యాయుల ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. మొత్తం 263 ఖాళీలను చూపించారు. 218 మంది హెచ్ఎంలకు తప్పనిసరి బదిలీ ఉండగా, 90 మంది రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల వెబ్ ఆప్షన్లు మొదలయ్యాయి. నేటి(బుధవారం)తో స్కూల్ అసిస్టెంట్ల ఆప్షన్లు, ఈ నెల 8తో ఎస్జీటీల ఆప్షన్లు ముగియనున్నాయి. తొమ్మిదో తేదీ నుంచి జాబితాలను ప్రకటిస్తారు.

పొరపాట్లను సరిదిద్దండి

పీడీ పోస్టుల ఖాళీలను చూపించడంలో సిబ్బంది తప్పిదాలు చేశారని, వాటిని సరిదిద్దాలని ఫిజికల్ డైరెక్టర్ల (పీడీ) సంఘం నాయకులు.. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్‌కు విన్నవించారు. జీఓ 45 ప్రకారం ప్రతి జెడ్పీ హైస్కూల్‌కు ఒక ఎస్ఏ పీడీ పోస్టును కేటాయించాల్సి ఉందన్నారు. శింగనమల మండలం ఆకులేడు పాఠశాలకు ఒక పీడీ పోస్టు కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ కేటాయించకుండా.. తరిమెల పాఠశాలకు అదనంగా రెండో పోస్టు ఇచ్చారన్నారు. ఇటీవలే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయిన కమ్మూరు, కోన ఉప్పలపాడు, మాల్యవంతం పాఠశాలలకు పీడీ పోస్టు ఖాళీగా చూపించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీడీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నరసింహారెడ్డి, ప్రధానకార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

9న కౌన్సెలింగ్

అనంతపురం క్రైం: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఏఆర్‌టీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సుల పోస్టు భర్తీకి సంబంధించి ఈ నెల 9న అనంతపురం సర్వజనాస్పత్రిలోని టీబీ అధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుది మెరిట్ జాబితాను అనంతపురం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ ప్రతులతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అనుపమ జేమ్స్ సూచించారు.

అనంత యువకుడు సౌదీలో ఆత్మహత్య

- కుమారుడి మరణవార్త విని కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



దాదాపీర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనంత (ఇన్‌సెట్) దాదాపీర్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉద్యోగం కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన ఓ యువకుడు ఏమైందో తెలియదుగానీ అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం చేరడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని రంగస్వామి నగరుకు చెందిన షేక్ దాదాపీరా, ఖాదర్‌బీ దంపతులకు షామీర్, దాదాపీర్(23) అనే ఇద్దరు కుమారులు. మూడు నెలల క్రితం వీసా తీసుకుని సౌదీలో ఉద్యోగాన్వేషణకు వెళ్లారు. షామీర్‌కు వెంటనే ఉద్యోగం దొరికింది. దాదాపీర్‌కు రెండు రోజుల క్రితం ఉద్యోగం లభించింది. ఇంతలోనే ఏం జరిగిందో తెలియదుగాని ఇంట్లో ఎవరూ లేని సమయంలో దాదాపీర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన సోదరుడు షామీర్ విషయాన్ని అనంతపురంలోని తల్లిదండ్రులకు చేరవేశాడు. దీంతో వారు గుండెలవిసేలా రోదించారు. 'అమ్మా.. వెళ్లొస్తానని నవ్వుతూ ఇంటి నుంచి వెళ్లితివి. ఇంతలోనే ఏమైంది బిడ్డా! ఎందుకింత అన్యాయం చేసి వెళ్లావు' అంటూ ఖాదర్‌బీ కన్నీరు మున్నీరైంది.

ఎమ్మెల్యే అనంత పరామర్శ

దాదాపీర్ కుటుంబ సభ్యులను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ప్రభుత్వంతో మాట్లాడి దాదాపీర్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా ఇక్కడికి రప్పిస్తామన్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. దాదాపీర్ మృతదేహాన్ని అనంతకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బోధనాస్పత్రికి మహర్దశ

- అనాటమీ విభాగానికి 9 పీజీ సీట్లు మంజూరు
- 87కు చేరిన పీజీ సీట్ల సంఖ్య



అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని బోధనాస్పత్రి (సర్వజనాస్పత్రి– వైద్య కళాశాల)కి మహర్దశ వచ్చింది. అనాటమీ విభాగానికి కొత్తగా తొమ్మిది పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పీజీ సీట్ల సంఖ్య 87కు చేరింది. 2000 సంవత్సరం ఏప్రిల్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైంది. గత ప్రభుత్వంలో అరకొరగానే పీజీ సీట్లు మంజూరయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్య రంగంలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతో ఊహకందని రీతిలో 50కి పైగా పీజీ సీట్లు వచ్చాయి. ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్, పెథాలజీ, ఎస్‌పీఎం, ఫిజియాలజీ, అనాటమీ, బయో కెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ఓబీజీ, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, అనస్తీషియా, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ విభాగాలకు పీజీ సీట్లు వచ్చాయి. ఇక రేడియాలజీ, పల్మనాలజీ విభాగాలకు మాత్రమే మంజూరు కావాల్సి ఉంది. వీటికి కూడా రెండు, మూడు నెలల్లో మంజూరయ్యే అవకాశం ఉంది. ఇవి కూడా వస్తే పీజీ సీట్ల సంఖ్య వందకు చేరుతుంది. పీజీ సీట్లు పెద్దసంఖ్యలో రావడం వల్ల నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. పేదలకు మరింత నాణ్యమైన వైద్యం అందించేందుకు వీలు కలుగుతుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

బదిలీలకు 194 మంది దరఖాస్తు

అనంతపురం క్రైం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మునిసిపాలిటీలు, అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల్లో 194 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. దీంతో అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, శానిటేషన్ పోస్టులకు మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి బదిలీలు నిర్వహించనున్నారు.

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షకు 75.09 శాతం మంది హాజరు

అనంతపురం అర్బన్: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో రోజు మంగళవారం జరిగిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షకు 552 మంది అభ్యర్థులకు గానూ 392 మంది (75.09 శాతం) హాజరయ్యారు.

క్లుప్తంగా

బావిలో గల్లంతైన వ్యక్తి మృతి


వట్టప్ప (ఫైల్)

శెట్టూరు: బావిలో గల్లంతైన వ్యక్తి మృతదేహమై తేలాడు. వివరాలు.. మండలంలోని కనుకూరుకు చెందిన హరిజన్న వట్టప్ప (35) అలియాస్ తిప్పే స్వామి సోమవారం ఉదయం ముచ్చర్లపల్లి శివారులో ఉన్న బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. బావిలో దూకిన వట్టప్ప ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో అక్కడ ఉన్న యువకులు బావిలో దూకి గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. 5 గంటలకు పైగా శ్రమించిన ఫలితం దక్కలేదు. అప్పటికే చీకటి పడుతుండడంతో గాలింపు చర్యలను విరమించి, బావిలో నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడేసే చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం బావి నీటిలో తేలుతున్న వట్టప్ప మృతదేహం గుర్తించి, వెలికి తీశారు. ఘటనపై ఎస్ఐ యువరాజ్ దర్యాప్తు చేపట్టారు.

'పది' పరీక్షకు 1,848 మంది గైర్హాజరు

రాప్తాడు రూరల్: పదో తరగతి సప్లిమెంటరీలో భాగంగా మంగళవారం జరిగిన గణితం పరీక్షకు 1,848 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 49 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 10,910 మంది విద్యార్థులకు గాను 9,062 మంది హాజరయ్యారు. డీఈఓ సాయిరామ్ 3 కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ 3 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 16 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఖాద్రీశుడి కల్యాణోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13, 14, 15, 16, 19, 20, 21, 22, 23, 25, 26, 27, 28, 30వ తేదీల్లో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవాలు ఉంటాయన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని, ఒక రోజుకు 5 కల్యాణసేవ టిక్కెట్లు మాత్రమే జారీ చేస్తామన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.4 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్కో టికెట్‌పై ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు.

తపాలా శాఖలో బదిలీలకు గ్రహణం

అయ్యవారు లేరని అమావాస్య ఆగిందనే నానుడి తపాలా శాఖకు సరిగ్గా సరిపోయేలా ఉంది. దేశ వ్యాప్తంగా తపాలా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయినా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇది ఆ శాఖ ఉద్యోగుల్లో అసహనం పెంచుతోంది.

- షెడ్యూల్ గడువు ముగిసినా ముందుకు సాగని ప్రక్రియ
- తపాలా ఉద్యోగుల్లో పెరుగుతున్న అసహనం
- నూతన సూపరింటెండెంట్ రాకతో ఉద్యోగుల్లో మొదలైన ఆశ



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో తపాలా శాఖకు సంబంధించి రెండు డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌కు ఒక్కో సూపరింటెండెంట్ ఉంటారు. సబ్ పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ల బదిలీలన్నీ వారి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంది. అయితే ఈసారి మాత్రం బదిలీల ప్రక్రియ ఆగిపోయింది. ఇందుకు అనంతపురం డివిజన్‌కు రెగ్యులర్ సూపరింటెండెంట్ లేకపోవడం ఓ కారణమైతే, హిందూపురం డివిజన్ సూపరింటెండెంట్ తన బిడ్డ పెళ్లి కోసం సెలవులో వెళ్లడంతో అక్కడా బదిలీల ప్రక్రియ ఆగిపోయింది.

గత నెల 4న నోటిఫికేషన్ జారీ

తపాలా శాఖలో ఒకే స్టేషన్‌లో ఆరేళ్లు, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ బదిలీ చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితా సైతం రూపొందించారు. సబ్ పోస్ట్‌మాస్టర్లు, పోస్టల్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు ఇలా అన్ని విభాగాలకు సంబంధించిన వారి సీనియారిటీ జాబితా తయారు చేసి ప్రకటించారు. అనంతరం బదిలీలకు గత నెల 4న నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుల సమర్పణకు అదే నెల 12వ తేదీ ఆఖరు కాగా, 26వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ అయిన ఉద్యోగులు 30వ తేదీలోపు ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించేలా షెడ్యూల్ ప్రకటించారు.

ఇన్‌చార్జ్‌కు పట్టని బదిలీల ప్రక్రియ

కొన్నేళ్లుగా అనంతపురం డివిజన్‌కు రెగ్యులర్ సూపరింటెండెంట్ లేకపోవడంతో గుంతకల్లు అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండడంతో ఇక్కడ పరిపాలన పూర్తిగా గాడి తప్పింది. దీంతో బదిలీల కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగుల మొర ఆలకించేవారు కరువయ్యారు. దీనిపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ మేరకు బదిలీల ప్రక్రియ జరగని విషయాన్ని ఆ శాఖ కర్నూలు రీజియన్ అధికార్లు సైతం పట్టించుకోకపోవడంపై తపాలా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం అనంతపురం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌గా హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇప్పటికైనా బదిలీ ప్రక్రియ మొదలవుతుందనే ఆశ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

తపాలా శాఖలో బదిలీల షెడ్యూల్ ఇలా	
నోటిఫికేషన్ జారీ	4.5.2023
దరఖాస్తుల సమర్పణ	12.05.2023
ఆప్షన్ల ఎంపిక	19.05.2023
బదిలీల కౌన్సెలింగ్	26.05.2023
బదిలీ అయిన ప్రదేశంలో జాయినింగ్	30.05.2023

సెలవులో 'పురం' ఎస్పీ

తన బిడ్డ పెళ్లి ఉందంటూ హిందూపురం డివిజన్ ఎస్పీ సెలవులో వెళ్లిపోయారు. ఆయన ఈ నెల 14వ తేదీ వరకూ సెలవు ఉంటారు. దీంతో అక్కడ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఫలితంగా కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకుని వెళ్లాలని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది.

విద్యా సంవత్సరం దగ్గరపడుతున్నా..

పాఠశాలలు, కళాశాలలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల వారు ఫోన్ల మీద ఫోన్లు చేస్తూ పిల్లల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సెలవులు ముగియకనే కోరుకున్న చోటుకు వెళ్లి పిల్లలను మంచి పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. అయితే బదిలీలు కాకపోవడంతో వారిలో టెన్షన్ అంతకంతకూ పెరిగిపోతోంది. తపాలా శాఖ ఉద్యోగులు అసహనంతో రగిలిపోతున్నారు.

బదిలీల ప్రక్రియ వెంటనే మొదలుపెట్టాలి



బదిలీలన్నీ మే 26 నాటికి పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినా ఉమ్మడి అనంత జిల్లాలోని డివిజన్లలో బదిలీల ప్రక్రియ ఆగిపోయింది. దీంతో పిల్లల చదువులపై ఉద్యోగుల్లో ఆందోళన పెరిగిపోతోంది. వెంటనే బదిలీల ప్రక్రియ మొదలుపెట్టాలి. లేదంటే ఆందోళనకు దిగుతాం.

– కె.బ్రహ్మానందరెడ్డి, డిప్యూటీ సర్కిల్ సెక్రటరీ, భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (బీపీఈఏ), అనంతపురం

క్రీడలతోనే మానసిక, శారీరక వికాసం

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్


మాట్లాడుతున్న మాంఛూ ఫెర్రర్

అనంతపురం: క్రీడలతోనే మానసిక, శారీరక వికాసం సాధ్యమని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ అన్నారు. అండర్–11, 13 మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ బాల, బాలికల టోర్నమెంట్ ఆర్డీటీ అనంత క్రీడాగ్రామంలో మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేలా ఆర్డీటీ దోహదపడుతోందన్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌బాల్‌లో నైపుణ్యమైన క్రీడాకారులను తయారు చేయడానికి చేపట్టిన చర్యలను వివరించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ సీఈఓ ప్రవీణ్ అనోకర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రమాణాలను ఆర్డీటీలో కల్పించారని, ఇంతటి చక్కటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడా మైదానాలను ఆర్డీటీ అభివృద్ధి చేయడంపై ప్రశంసలు కురిపించారు. ఆర్డీటీ క్రీడలకు చేస్తున్న కృషికి గాను భారత రాష్ట్రపతి చేతుల మీదుగా రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్–2019 అవార్డు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ శోభన్ పాల్గొన్నారు.

గంజాయి తరలింపుదారు పరారీ!

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల అదుపులో ఉన్న గంజాయి తరలింపుదారు.. చివరి క్షణంలో తప్పించుకుని పారిపోయాడు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. నాలుగు రోజుల క్రితం అనంతపురంలో గంజాయి దిగుమతి చేస్తూ ఓ వ్యక్తి జిల్లా పోలీసు ప్రత్యేక బృందానికి పట్టుబడ్డాడు. విచారణలో తన నేరాన్ని ఆ వ్యక్తి అంగీకరిస్తూ తనతో పాటు తీసుకువచ్చిన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేశాడు. దీంతో గంజాయితో పాటు నిందితుడిని అనంత శివారులోని పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక బృందం అప్పగించింది. అప్పటి నుంచి ఈ కేసులో సదరు పోలీస్ స్టేషన్ అధికారులు మరింత లోతు విచారణ చేపట్టారు. ఈ తంతు కూడా దాదాపు పూర్తి కావస్తుండడంతో ఇక అరెస్ట్ చూపించాలని అనుకుంటున్న చివరి క్షణంలో పోలీసుల కళ్లు గప్పి నిందితుడు స్టేషన్ నుంచి పారిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన పోలీసులు ఈ విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో వారిపై ఎస్పీ శ్రీనివాసరావు సీరియస్ అయినట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాలతో నిందితుడిని పట్టుకుని వచ్చేందుకు రెండు బృందాలుగా విడిపోయిన పోలీసులు ఓ బృందం యూపీకి, మరో బృందం బెంగళూరుకు వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీస్‌లు అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం.

మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు

- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం జగన్ అండ
- ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు టౌన్: 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ ఆపన్నులకు భరోసానిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... ఈ నెల 1న కర్నూలు జిల్లా పత్తికొండ వేదికగా జరిగిన రైతు భరోసా కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. వివరాలు.. గుంతకల్లులోని అంబేడ్కర్ నగర్ నివాసి పరుశురాముడు స్థానికప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. 18 నెలల క్రితం అనారోగ్య సమస్య తలెత్తడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అతని ఎడమ కాలును వైద్యులు తొలగించారు. అలాగే బెంచి కొట్టాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సాయికార్తీక్ ఐదు నెలల క్రితం ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద క్రికెట్ ఆడుకుంటుండగా గోడ కూలడంతో ఎడమ కాలు తొలగించారు. నిరుపేదలైన ఈ రెండు కుటుంబాల సభ్యులకు వీరి వైద్య చికిత్సల భారం భరించలేనిదిగా మారింది. దీంతో ఈ నెల 1న పత్తికొండలో సీఎం వైఎస్ జగన్‌ను కలసి తమ దుస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం బాధితులకు వెంటనే సాయమందించాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. దీంతో ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సాయం మంజూరు కావడంతో ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో మంగళవారం గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ బి.రాము, భూసర్వే డీటీ ఆదినారాయణ, కౌన్సిలర్ విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా.. బదిలీలా?

- ఆడిట్ ఉద్యోగుల ఆందోళన


అనంతపురంలోని ఆడిట్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువు తీరిన తర్వాత ఉద్యోగుల బదిలీలు ఎలా చేస్తారంటూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆడిట్ ఉద్యోగులు ఏపీ ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్(ఎఫ్ఏసీ) హరిప్రకాష్ జోక్యాన్ని తప్పుబట్టారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ట్రెజరర్ బషీర్ అహమ్మద్, నగర ట్రెజరర్ విష్ణువర్దన్ తదితరులు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గత నెల 22 నుంచి 30వ తేదీలోపు బదిలీల ప్రక్రియను కర్నూలులోని రీజనల్ డైరెక్టర్ పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే ఆ బదిలీలను హరిప్రకాష్ రద్దు చేయడమేకాక, ఇష్టారాజ్యంగా బదిలీలు చేసి, పాత తేదీలతో రూపొందించిన ఉత్తర్వులను ఈ నెల 3న జారీ చేయడంపై మండిపడ్డారు. బదిలీలకు అర్హులు కాని వారిని, కనీసం రిక్వెస్ట్ లెటర్లు కూడా పెట్టని వారిని, ఏడాది కూడా ఒక చోట పని చేయని వారిని సహేతుకమైన కారణాలు లేకుండా ఎలా బదిలీ చేస్తారంటూ ప్రశ్నించారు. ఉద్యోగులపై కక్ష సాధింపు కోసమే డైరెక్టర్ ఇలా వ్యవహరించారని, నిబంధనలకు విరుద్ధంగా సాగిన బదిలీలను రద్దుచేయకపోతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం రాత్రికే విజయవాడ బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆడిట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు అజయ్‌కుమార్, దస్తగిరి, సభ్యులు, ఆడిట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, ఆపై కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపిన మేరకు.. గుంతకల్లులోని సిద్దేశ్వర నగర్‌కు చెందిన బి.రామాంజినేయులు (46) డీఆర్ఎం కార్యాలయంలోని టీఆర్ఎస్ఓ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమార్తెలున్నారు. మూర్చ వ్యాధితో బాధపడుతున్న రామాంజినేయులుకు కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం ఉదయం డ్యూటీకి వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు తెలిపి నేరుగా అరవిందనగర్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో తన స్నేహితుడు విజయ్ చంద్రశేఖర్ పేరుతో ఖాళీగా ఉన్న ఇంటికి వెళ్లి పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడి భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : పోతుల సురేష్

కదిరి టౌన్/అర్బన్: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని సామాజిక ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత పోతుల సురేష్ స్పష్టం చేశారు. కదిరిలోని ఆర్య వైశ్య కల్యాణ మంటపంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయులకు సన్మానం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం ముందున్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంకదార రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కలవల రామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తన భార్య పోతుల సునీతకు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు గుర్తు చేశారు. ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యతతో పాటు నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించేలా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. అనంతరం పోతుల సురేష్‌ను ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ ముక్కాల్ ద్వారకానాథ్, సెక్రటరీ సాధు ప్రతాప్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడా వరప్రసాద్, కార్యదర్శి ఆనందబాబు, ట్రెజరరీ జనార్దన్ గుప్త, సంఘం నాయకులు, అనుబంధ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీకేఎస్‌లో అదనపు 11కేవీ ఫీడర్

అనంతపురం టౌన్: బుక్కరాయసముద్రం సబ్ స్టేషన్‌కు అదనంగా మరో 11కేవీ ఫీడర్ బ్రేకర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పరిశ్రమలు నెలకొల్పడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకోకుండా ఉండేలా అదనంగా 11కేవీ ఫీడర్ బ్రేకర్‌ను అమర్చినట్లు అనంతపురం ఈఈ జేవీ రమేష్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం ఈ ఫీడర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

హోరాహోరీగా గిరకబండి లాగుడు పోటీలు


గిరక బండిని లాగుతున్న ఎద్దులు

విడపనకల్లు: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని విడపనకల్లు మండలం ఉండబండలోని గ్రామ సచివాలయ వలంటీర్ల ఆధ్వర్యంలో మంగళవారం గిరకబండి లాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అదే గ్రామానికి చెందిన ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. పదిహేను నిమిషాల వ్యవధిలో రైతు పాల్తూరు హరికృష్ణకు చెందిన ఎద్దులు 2,813 అడుగుల దూరం బండిని లాగి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. ద్వితీయ స్థానంలో పల్లి పెద్దలింగప్ప ఎద్దులు, తృతీయ స్థానంలో ఆకుతోట రామాంజినేయులు ఎద్దులు, నాల్గో స్థానంలో పల్లి శ్రీనివాసులు ఎద్దులు, ఐదో స్థానంలో రవిచంద్ర ఎద్దులు నిలిచాయి. విజేత ఎద్దుల యజమానులకు వలంటీర్లు సొంతంగా నగదు పురస్కారాలను అందజేశారు. పోటీలో పాల్గొన్న మిగిలిన ఎద్దుల యజమానులకు కన్సొలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. బహుమతుల ప్రదాన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పశువుల భాస్కర్, పశువుల ఓబులప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సాహించేందుకే ఈ పోటీని నిర్వహించినట్లు వలంటీర్లు శ్రీధర్, అశోక్ తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు గోపాల్, రాము, పవన్, బి.వన్నూరుస్వామి, చిదంబరం, లింగేష్, కిష్టప్ప, పి.వన్నూరుస్వామి, ప్రతాప్, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు

- డిపో మేనేజర్లను ఆదేశించిన డీపీటీఓ సుమంత్


మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని

అనంతపురం సెంట్రల్: ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని డిపో మేనేజర్లను జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) సుమంత్.ఆర్.ఆదోని ఆదేశించారు. బస్సు సర్వీసులపై జిల్లాలోని అన్ని డిపో మేనేజర్లతో మంగళవారం అనంతపురంలోని తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. సెక్టార్ వారీగా పనితీరు బాగా లేని సర్వీసులను గుర్తించి రీ షెడ్యూల్ చేయాలని సూచించారు. కేఎంపీఎల్ పెంచాలని, బ్రేక్ డౌన్ తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్గో సేవల్లో భాగంగా స్వీకరించిన వస్తువులను వెంటనే డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు డ్రైవర్లను చైతన్య పరుస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డిపో మేనేజర్లు నాగభూపాల్, శంకర్, రామచంద్ర, బాలాజీ దయాల్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు వరప్రసాద్, ఎస్‌కే నాయక్, రమణమ్మ, ఎస్టీఐ నాగార్జున, ఏఎంఎఫ్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని దౌర్జన్య కాండ

- ముదిగుబ్బ బైపాస్ పనుల నాణ్యత పరిశీలనకు వచ్చిన అధికారుల ల్యాప్‌టాప్ అపహరణ
- భోజన సమయంలో హోటల్‌లో ఉన్న అధికారుల నుంచి ల్యాప్‌టాప్ అపహరించిన దుండగుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మైనింగ్ అండ్ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి


ల్యాప్‌టాప్ అపహరణపై ముదిగుబ్బ సీఐకి ఫిర్యాదు చేస్తున్న మైనింగ్ అండ్ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి

ధర్మవరం: ముదిగుబ్బ మండలంలో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించేందుకు వచ్చిన మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యం కొనసాగుతూనే ఉంది. మొన్నటికి మొన్న బైపాస్ రోడ్డు పనుల నాణ్యత పరిశీలించేందుకు వచ్చిన అధికారులపై మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి అనుచరులు దౌర్జన్యానికి దిగిన విషయం మరువకముందే మంగళవారం మరో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఉదయం నుంచి పనులను పరిశీలించారు. తర్వాత ముదిగుబ్బ మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో భోజనానికి వెళ్లారు. అక్కడ భోజనం చేస్తుండగానే పక్కనే ఉంచుకున్న నల్లబ్యాగులోని ల్యాప్‌టాప్‌ను ఆగంతకుడు ఎత్తుకెళ్లాడు. అవాక్కయిన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. మైనింగ్ అండ్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) విజయలక్ష్మి స్వయంగా ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ కంబగిరి రామునికి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు హోటల్లోని సీసీ కెమెరా ఫుటేజీని, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. నిందితుణ్ని త్వరలోనే పట్టుకుని ల్యాప్‌టాప్ రికవరీ చేస్తామని సీఐ తెలిపారు.

ఆ అవసరం ఎవరికి ఉంది?

విజిలెన్స్ అధికారులు విచారణ చేసిన తర్వాత వివరాలను ల్యాప్‌టాప్‌లో నిక్షిప్తం చేసుకున్నారు. దీంతో ఆ ల్యాప్‌టాప్ అపహరణకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. బైపాస్ పనులలో నాణ్యతా లోపాలు బయటపడతాయన్న ఉద్దేశంతో కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన వారే ఈ పని చేసి ఉండొచ్చన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ సమయంలో సదరు సంస్థ సిబ్బంది అధికారులను అడ్డుకోవడం, దౌర్జన్యానికి దిగడం వంటి అంశాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. పోలీసులు సకాలంలో ల్యాప్‌టాప్ రికవరీ చేయకపోతే అందులోని ఆధారాలు ధ్వంసం చేసే ప్రమాదం ఉంది.

క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దయాకర్

ఆత్మకూరు: వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో ఆశాడే నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ డయేరియాపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారం రోజులు ముందుగా ఆస్పత్రిలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వలంటీర్లను బుధవారం సన్మానించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతులమీదుగా వలంటీర్లను సన్మానిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వలంటీర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

జిల్లా కళాకారులకు అవకాశం



మాట్లాడుతున్న చిత్ర యూనిట్ సభ్యులు

అనంతపురం కల్చరల్: శ్రీరంగాపురం చిత్ర నిర్మాణ సంస్థ శ్రీసాయి లక్కీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తదుపరి చిత్రంలో జిల్లా కళాకారులకు అవకాశం కల్పించనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు చిందనూరు నాగరాజు తెలిపారు. మంగళవారం తపోవనంలోని ఓ ఫంక్షన్ హాలుగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8 ఉదయం 10 గంటలకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కళాకారుల ఎంపిక ఉంటుందన్నారు. చిత్ర దర్శకుడు శివప్రసాదరెడ్డి, కథా రచయిత నవీన్, ఫైట్‌మాస్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు చేయూత

అనంతపురం టవర్‌క్లాక్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉండి విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు చదువుకునేందుకు చేయూతనందిస్తామని నవచైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి వీరాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థిక స్థోమతలేని విద్యార్థులు తమ సొసైటీని సంప్రదిస్తే ఫీజు చెల్లింపునకు ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 94415 51930లో సంప్రదించాలన్నారు.

విత్తనశుద్ధిని పరిశీలించిన ఏడీఏ



ప్రాసెసింగ్ ప్లాంట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం.రవి మంగళవారం స్థానికంగా ఉన్న ప్రాసెసింగ్ ప్లాంట్లలో విత్తన వేరుశనగ శుద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. విజయ ఆగ్రో ఏజెన్సీస్, నాగనందీశ్వర ప్లాంట్లను సందర్శించి, వేరుశనగ నాణ్యతను చూశారు. రైతులకు రాయితీతో ఇస్తున్న వేరుశనగకు సంబంధించి నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదన్నారు. నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కాగా ఇప్పటి వరకు ఆర్‌బీకే వేదికగా 14 వేల మంది రైతులకు 16 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు డీఏవో కార్యాలయ వర్గాల తెలిపాయి. మంగళవారం నాటికి 42 వేల క్వింటాళ్ల ఆర్‌బీకేలకు సరఫరా పూర్తయినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే ధనలక్ష్మి తెలిపారు.

28 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: సాగిలిటీ కంపెనీ ఆధ్వర్యంలో పీవీకేకే డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ నియామాల్లో 28 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునికృష్ణారెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు బెంగళూరులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వార్షిక వేతనం రూ. 4.50 లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె రఘునాథ్‌రెడ్డి అభినందించారు. కళాశాల సిబ్బంది, సాగిలిటీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ప్రజా సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి



మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు, రూ.2069 కోట్లతో సంక్షేమ ఫలాలు అందించామన్నారు. భవిష్యత్ తరాల వారికి కూడా ఉపయోగపడేలా ఆర్‌ఓబీ ఆవశ్యకతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేసి, ఆయన ద్వారా కేంద్రానికి విన్నవించి రూ.311.93 కోట్లతో ఫోర్ వే, రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంజూరు చేసుకున్నామన్నారు. నగరంలోని 5వ డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ జయలలితతో కలిసి ప్రతి ఇంటా తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఇంకా సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లకు క్రమశిక్షణ ముఖ్యమని వలంటీర్లు మహేంద్రపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ లేకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీనివాస్ నగర్‌లో పలు ప్రాంతాల్లో పోల్లను మార్చాలని, ఓ వృద్ధురాలికి పింఛన్ మంజూరు చేయించాలని సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు.

పసుపు కుంకుమతో సరిపెట్టారు..

2014 ఎన్నికల ముందు తాము అధికారంలోకొస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చేస్తామన్న టీడీపీ నాయకులు.. మహిళలకు పసుపుకుంకుమ పంచి సరిపెట్టారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇటీవల మహానాడులో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోలో తమ ప్రభుత్వం పథకాలను మార్చి, సంక్షేమం అందిస్తామని చెప్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే రాష్ట్రం దివాళా తీస్తోందని, అప్పులపాలవుతోందని టీడీపీ, జనసేన పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు.

ఫోర్‌వే, ఆర్‌ఓబీపై తప్పుడు ప్రచారాలు...

ఫోర్‌వే, ఆర్‌ఓబీ తమ ప్రభుత్వం వల్లే వచ్చిందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ ఎంపీ రామ్మోహన్ నాయుడు 2014లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసిన ఫొటోలను ప్రభాకర్ చౌదరి చూపుతున్నారన్నారు. 2014లో విజ్ఞప్తి చేస్తే 2015లో నేషనల్ హైవే పరిధిలో ఉన్న రోడ్డు స్టేట్ హైవే పరిధిలోకి ఏవిధంగా మార్చారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ప్రజలు అవకాశమిస్తే.. ఎమ్మెల్యే, ఎంపీ కేవలం కలహాలు, మాటలకే పరిమితమయ్యారని ఎమ్మెల్యే అనంత ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కడా లేదని తెలిపారు. 2024లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, నాయకులు పెన్నోబులేసు, అంకిరెడ్డి ప్రమీళ, ఉష, భారతి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా రెన్యూవల్‌పై నిర్లక్ష్యం చేయొద్దు



వలంటీర్లతో మాట్లాడుతున్న మేయర్ వసీమ్

అనంతపురం క్రైం: వైఎస్సార్ బీమా రెన్యూవల్‌పై నిర్లక్ష్యం చేయొద్దని నగర మేయర్ వసీం అన్నారు. మంగళవారం 22వ డివిజన్‌లో జరుగుతున్న వైఎస్సార్ బీమా నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ బీమా నమోదు ప్రక్రియ ఈనెల 7 వరకు కొనసాగుతుందన్నారు. అర్హులతో వైఎస్సార్ బీమా చేయించాలన్నారు. ఎవరైనా కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తూ మరణిస్తే వైఎస్సార్ బీమా పథకం కింద రూ. 5 లక్షలు అందుతుందని, సహజ మరణమైతే బాధిత కుటుంబానికి రూ.లక్ష అందిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, సంపంగి రామాంజనేయులు, లీలావతి, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తకు నిప్పంటుకొని అగ్ని ప్రమాదం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో చెత్తకు నిప్పంటుకొని మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు కృషి చేశారు. అండర్ గ్రౌండ్‌లో భారిగా చెత్త పేరుకుపోవడంతో అటుగా వెళ్లిన పాదచారులు సిగరెట్ కాల్చి వేయడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్త పేరుకుపోయి కాంప్లెక్స్ దుర్వాసన వస్తోంది. స్థానిక వ్యాపారులు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదు.

రేపు సంగీత విభావరి

గుత్తి: పట్టణంలోని కెఎం ఫంక్షన్ హాల్లో(ఓల్డ్ రాయల్ థియేటర్) గురువారం సాయంత్రం ఎస్పీ బాల సుబ్రమణ్యం జయంత్యుత్సవాల్లో భాగంగా సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఎస్పీ బాలు కల్చరల్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రకటన విడుదల చేశారు. విజేతలకు విలువైన బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి రూరల్: తొండపాడు, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాలను ఏసీడీపీఓ ఢిల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని కేంద్రాలకు వెళ్లి చిన్నారుల హాజరు పరిశీలించారు. పిల్లలకు రోజు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అని విచారించారు. అనంతరం కొత్తపేటలో కొడిగుడ్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రూరల్ మండల నాయకులు

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక పెద్దాస్పత్రి వద్ద అనంతపురం రూరల్ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం అన్నదానం చేశారు. ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్లు దుగుమర్రి గోవిందరెడ్డి, బండి పవన్, సర్పంచ్‌లు గార్లదిన్నె కృష్ణయ్య, ఇటుకలపల్లి భాస్కర్‌రెడ్డి, పూలకుంట కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు ఉప్పరపల్లి శీనా, పూలకుంట భాస్కర్‌రెడ్డి, కాటిగానికాలవ శీలక ఆదినారాయణరెడ్డి అన్నదానంలో పాల్గొన్నారు.

రూ. 54 వేలు విరాళం..

జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కూలింగ్ వాటర్ మిషన్ కోసం సాయిట్రస్ట్ సభ్యులకు రూ. 54 వేలు విరాళంగా అందించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: ఐదో డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌లో బుధవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. శ్రీనివాస్‌నగర్‌లోని బాలాజీ కళ్యాణ మంటపం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ శ్రేణులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ,తదితరులు



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న చిట్రా వెంకటేష్, తదితరులు

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అనంతపురం నగర శివారులోని ఎమ్మెల్యే నివాసం వద్ద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేశారు. రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలి వచ్చి ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్రా వెంకటేష్ తదితరులు గజమాలలతో సత్కరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు తరలివచ్చారు. జన్మదినంతో పాటు ఇదే రోజు ఆయన ఎమ్మెల్యే పెళ్లిరోజు కావడంతో ఎమ్మెల్యే దంపతులకు పలువురు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్కేయూలో...

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను వేడుకలు నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లి భావితరాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, అనంతపురం జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు తిప్పలూరు సుధీర్ రెడ్డి, యూనివర్సిటీ నాయకులు రమేష్, హేమంత్, సురేష్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు మండలంలో...

రాప్తాడు: మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ముందుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాప్తాడులో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 200 కేజీల కేక్‌ను నాయకులు కట్ చేసి, వేడుకలు జరిపారు. నియోజకవర్గంలో సమర్థనాయకుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక్కరేనన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అనంతపురంలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసం చేరుకొని ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కల పంపిణీ

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సర్పంచ్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి ఆధ్వర్యంలో మంగవారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, మురళి, రాజశేఖర్, శ్రీరామ్, దామోదర్‌రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిన్నారులను కళల్లో ప్రోత్సహించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: చిన్నారులను కళల్లో ప్రోత్సహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎల్కేపీ కళా ప్రాంగణంలో లహరి ఫిట్‌నెస్ అకాడమీ వారి వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం సందడిగా జరిగింది. డాన్స్‌మాస్టర్ హరి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, సినీ దర్శకుడు ఘటికాచలం, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, లలిత కళాపరిషత్తు అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ, సీనియర్ డాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ పరేడ్ ..

వేసవి శిక్షణను వినూత్నంగా ముగించిన చిన్నారులు ఫ్యాషన్ పరేడ్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు పలు సినిమా పాటలకు డ్యాన్సులతో అదరగొట్టారు. బుల్లితెర నటుడు రమేష్‌నీల్ యాంకరింగ్‌తో హోరెత్తించాడు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత లక్ష్మీపతి, నోటరీ ఆనంద్, న్యాయనిర్ణేత పద్మజా ప్రసాద్, లంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమసలు పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



తహసీల్దారు కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

ఆత్మకూరు: ప్రజలకు అందుబాటులో ఉండి, భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. పట్టాలు మంజూరుకు వచ్చిన ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

వాహనాల వేలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం వేస్తున్నట్లు నాల్గో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ఉదయం 10 గంటలకు రూ.3వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందాం



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న యోగా గురువులు

అనంతపురం కల్చరల్: పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందామని మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి అన్నారు. మంగళవారం నెహ్రూ యువకేంద్ర, యువమిత్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో మూడు స్థానాల్లో నిలిచిన పవన్, జ్ఞానస్కంద, హాస్సేన్‌కు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. పతంజలి యోగా గురువు మహేష్ బాబు, ఎన్‌వైకె అధికారి శ్రీనివాసులు విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు

అనంతపురం అర్బన్: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైన రజకులను ఎస్టీజాబితాలో చేర్చాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు కోరారు. జూలై 21న రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సు అనంతపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రజకులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రజకులకు దోభీఘాట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసి, నాటి సౌకర్యం, విద్యుత్ సదుపాయంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు ఉచితంగా కల్పించాలన్నారు. రజకుల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులను పరిగణలోకి తీసుకొని ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, నాయకులు పోతులయ్య, పెనకచర్ల బాలయ్య, బంగారుబాషా, హరికృష్ణ, నాగప్ప, నాగరాజు, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ రమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో క్లాప్ నోడల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్లాప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో భాగంగా పారిశుధ్య కార్యదర్శుల సహకారం తీసుకొని తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి కంపోస్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూజర్ చార్జీలను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ రమణారెడ్డి మంగళవారం సాయంత్రం 45వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు నిర్వహణ సరిగా లేకపోవడంపై సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డీఈ, ఏఈలు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు



గంధంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం సమీపంలో వెలిసిన హజరత్ ఖాజా బందే నవాజ్ గేసుదాస్ ఉరుసు మంగళవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా హజరత్ దర్గా వద్ద నుంచి కోటలోని సయ్యద్ బాషా దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



మస్తాన్‌వలి(ఫైల్)

పామిడి: కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీ కొండాపురం వాసి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన డీ మస్తాన్‌వలి(48) గతనెల 30న పీ కొండాపురం రోడ్డులోని శ్రీపురం టౌన్‌షిప్ వద్ద బైక్‌పై వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మున్నీ, కుమార్తె దిల్షా, కుమారుడు టిప్పు సుల్తాన్ ఉన్నారు. అతడి మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పామిడి: పట్టణ గుత్తి బీసీసీ రోడ్డు హోండా షోరూమ్ సమీపాన మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..పామిడి బీసీ కాలనీవాసి శంకర్ పీ కొండాపురంలో దేవర కార్యక్రమం ముగించుకొని పామిడికి బయలుదేరాడు. అలాగే పామిడి నుంచి రామరాజుపల్లికి ముత్యాల్‌రెడ్డి బైక్‌పై బయలుదేరివచ్చాడు. హోండా షోరూమ్ సమీపాన బైకులు రెండు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈప్రమాదంలో శంకర్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ముత్యాలరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను హుటాహుటినా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శంకర్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

తాడిపత్రి: ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో తాడిపత్రి– కడప ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం రాత్రి ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఘటనలో లారీ డ్రైవర్ సుబ్బరాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యాలను దూరం చేసే చల్లని చిరునవ్వు ..
విధి నిర్వహణలో అంకితభావం ..
రోగులపాలిట ఆమె అపర నైటింగేల్ ...
సమాజ క్షేమం కోరేవారికి తర తమ భేదాలుండవు అని
తన చేతల్లో చూపుతోంది కామారెడ్డి జిల్లా బాన్సువాడ
ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న ఆరోగ్యజ్యోతి.

సేవాజ్యోతి



పాతికేళ్లుగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఎంతోమంది మన్ననలు అందుకున్నారు ఆరోగ్యజ్యోతి. ఆమె సేవలను గుర్తించి ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్నాటక వారు 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023' అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. మంగళ వారం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుని సేవాజ్యోతిగా గుర్తింపు పొందింది ఆరోగ్యజ్యోతి.

బోధన్ పట్టణానికి చెందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తోంది. 1998లో స్టాఫ్ నర్స్ ఉద్యోగంలో చేరి నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెండేళ్లు పనిచేసిన ఆమె 2000 సంవత్సరంలో బోధన్ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి అక్కడే ఇరవై ఏళ్లుగా విధులు నిర్వర్తించింది. 2019 లో హెడ్ నర్స్‌గా పదోన్నతి పొందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి, అక్కడే విధుల్లో కొనసాగుతోంది. కరోనా కాలంలో వైద్యులతో కలిసి రోగులకు ఎన్నో సేవలందించిన ఈ నైటింగేల్ పాతికేళ్ల కాలంలో ఎక్కడ ఉద్యోగం చేసినా విధి నిర్వహణకు అంకితమై పనిచేస్తూ వచ్చింది. దీంతో ఆమె అందరికీ తలలో నాలుకలా మారింది. ఆపరేషన్ థియేటర్‌తోపాటు ప్రసూతి వార్డుల్లోనే ఆమె ఎక్కువగా విధులు నిర్వర్తించింది. అధికారుల నుంచి ఎన్నో మన్ననలు, సామాజిక సేవలకు గాను అవార్డులనూ పొంది సేవాగుణంలో ముందువరసలో నిలిచింది.

మాకెంతో గర్వకారణం

సేవతో అందరి మన్ననలు పొందే ఆరోగ్య జ్యోతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023 అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మేమంతా గర్వించదగ్గ విషయం. ఈ అవార్డు స్ఫూర్తి మిగతా అందరిలో కలగాలని కోరుకుంటున్నాను.

– డాక్టర్ శ్రీనివాసప్రసాద్,
సూపరింటెండెంట్,
బాన్సువాడ ఏరియా ఆస్పత్రి

అందరి సహకారంతో...

సేవా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది. ఉద్యోగ నిర్వహణలో తోటి ఉద్యోగులు, వైద్యుల సహకారం, ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతున్నాను. నా చిన్నప్పుడు మా అమ్మానాన్నలు ఎంతోమందికి సాయం అందించేవారు. వాళ్లను చూసి నాకూ అలవాటైంది. నా ప్రయత్నాల్లో మా వారు అండగా నిలిచారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను.

– ఆరోగ్యజ్యోతి,
హెడ్‌నర్స్, బాన్సువాడ



కూతురి మరణంతో..

ఆరోగ్య జ్యోతి కూతురు అనుకోని పరిస్థితుల్లో విద్యుత్‌షాక్‌కు గురై మరణించింది. కూతురి మరణంతో ఆవేదనకు గురైన ఆరోగ్యలక్ష్మి తన సేవలను మరింత విస్తృతం చేయాలని సంకల్పించింది. ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టింది. వైద్యరంగంలో తన కున్న పరిచయాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేసే కార్యక్రమాలు చేపడుతుంటుంది. బీపీ, షుగర్, గుండె సంబంధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టి రోగులకు అండగా నిలుస్తోంది. అలాగే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేపట్టి, గర్భిణీలు, బాలింతలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం శిబిరాలు ఏర్పాటు చేసి ఆదుకుంటుంది.



బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ -2023 అవార్డు అందుకుంటున్న ఆరోగ్యజ్యోతి

– ఎస్.వేణుగోపాల్ చారి,
సాక్షి, కామారెడ్డి

మలీషా మాణిక్యమే

మనలో టాలెంట్ ఉండాలేగానీ పాతాళంలో ఉన్నా సరే రివ్వున ఎగసి మిలమిల మెరిసే తారల్లా అందరి చూపులను మనవైపు తిప్పుకోవచ్చు అని చెబుతోంది మలీషా ఖార్వ. ముంబై మురికివాడ ధారావిలో పుట్టిపెరిగిన 15 ఏళ్ల మలీషా నేడు లగ్జరీ బ్రాండ్ మోడల్‌గా మారి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



సాదాసీదాగా సాగిపోతున్న మలీషా జీవితాన్ని మలుపు తిప్పే సంఘటన ఒకటి జరిగింది. అదేమిటంటే, ఓ మ్యూజిక్ వీడియో తీయడానికి ఇండియా వచ్చిన హాలీవుడ్ నటుడు రాబర్ట్ హాఫ్‌మాన్.. తన పని పూర్తి చేసుకుని తిరిగి తన దేశానికి వెళ్లిపోదామనుకున్నాడు. కానీ అదే సమయంలో కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు దేశంలో లాక్‌డౌన్ విధించడంతో.. ఇక్కడే ఉండిపోవలసి వచ్చింది. ఈ సమయంలోనే అనుకోకుండా అతడికి మలీషాతో పరిచయం అయ్యింది. తాను కలిసిన వాళ్లందరిలోనూ ఆమె విభిన్నంగా, ముఖ కవళికలు చూడముచ్చటగా కనిపించడంతో హాఫ్‌మాన్, 'పెద్దయ్యాక ఏమవాలనుకుంటున్నావు?' అని ఆమెను సరదాగా అడిగాడు. క్షణం కూడా తడుముకోకుండా 'నేను మోడల్‌ని కావాలనుకుంటున్నాను'' అని చెప్పింది మలీషా. ఆ చిన్నారి కలలను నిజం చేసేందుకు రాబర్ట్ 'గో ఫండ్ మి' పేజీ క్రియేట్ చేశాడు. దీంతోబాటు ఆమెను ఓ మోడలింగ్ మేనేజర్‌కు పరిచయం చేశాడు. అంతటితో ఆగక మలీషా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీ క్రియేట్ చేశాడు.

అప్పటినుంచి మోడలింగ్ మేనేజర్ చెప్పినట్లు చేస్తూ మోడల్‌గా ఫొటోలు దిగేది మలీషా. ఆ ఫోటోలు ప్రముఖ ఫారెస్ట్ ఎసెన్షియల్ బ్రాండ్‌కు నచ్చడంతో ... వారు కొత్తగా ప్రవేశపెట్టిన 'దయువతి కలెక్షన్స్'కు మలీషాను మోడల్‌గా తీసుకున్నారు. ఫారెస్ట్ ఎసెన్షియల్ స్టోర్‌కు వెళ్లిన మలీషా అక్కడ ఉన్న పోస్టర్లు, బ్రాండ్ ఉత్పత్తులపై తన ఫోటో రావడంతో తెగ సంబరపడిపోయింది. మలీషా సంబరపడిపోతున్న వీడియోను బ్రాండ్ వారు అధికార ఇన్‌స్టాగ్రామ్ పేజీలో విడుదల చేశారు. ఈ వీడియోకు యాభైలక్షలకుపైగా వ్యూస్, లైక్‌లు రావడంతో సోషల్ మీడియాలో మలీషా బాగా పాపులర్ అయ్యింది. ఈ వీడియో చూసిన నెటిజనులంతా ఆమెను ''ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్''గా అభివర్ణిస్తున్నారు.

మోడలింగ్‌తోపాటు నటనలో కూడా తన టాలెంట్ చూపిస్తోన్న మలీషా ''లీవ్ యువర్ ఫెయిరీ టేల్'' డాక్యుమెంటరీలో నటించింది. పీకాక్ మ్యాగజీన్‌పైనేగాక, సమీరారెడ్డి, కుషాకపిలతోపాటు మలీషా ఫోటో 'కాస్మో ఇండియా మ్యాగజీన్'పైన కూడా రావడం విశేషం. పదోతరగతి చదువుతోన్న మలీషా పరిణితి చెందిన అమ్మాయిలా కనిపిస్తుంది. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతుంది. తనకొచ్చిన పాపులారిటీతో భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు మలీషా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. తన కలలు నిజం కావాలని ఆశిద్దాం.

కిడ్నాప్ చేస్తారని భయం వేసింది!

"ప్రియాంక చోప్రాలా మోడల్ అవాలని, నోరా ఫతేహీ డ్యాన్స్ చేయాలని ఉండేది. కానీ మాది చాలా పేద కుటుంబం. ఈ మురికి వాడ నుంచి ఆ స్థాయికి ఎలా ఎదగాలి అని ఆలోచిస్తూ ఉండేదాన్ని. మోడలింగ్ మేనేజర్‌ను కలిశాక... 'ఎవరో ఒకతను నా ఫోటోలు తీస్తుంటే ఎందుకితను నా ఫొటోలు తీస్తున్నాడు? బహుశా కిడ్నాప్ చేస్తాడేమో' అని భయం వేసింది. అది గమనించిన ఆ మేనేజర్ 'అలాంటిదేం లేదు. నీ ఫోటోలు పాపులర్ అవుతాయి' అని చెప్పడంతో భయం పోయింది. ఆ ఫోటోలు చూసిన మేనేజర్ 'నీ కళ్లు చాలా బావున్నాయి. మోడల్‌వి అవుతావా?' అని అడిగారు. అప్పుడు నేను మా నాన్నను అడగాలని చెప్పాను. వెంటనే ఆయన నాన్న గారిని కలిసి మోడలింగ్ గురించి వివరించి చెప్పారు. నాన్న వెంటనే మా తాతయ్యవాళ్లతో చెప్పి ఒప్పించడంతో ఇప్పుడు నా కలలను నిజం చేసుకోవడానికి దారి దొరికింది. మోడలింగ్ చేస్తూ ఉన్నత చదువులు చదువుతాను" అని ఎంతో ఆత్మ విశ్వాసంతో, మరెంతో సంతోషంతో చెప్పింది.





బ్యూటిప్స్

రంధ్రాలు మాయం చేసే.. మెంతి ప్యాక్!

రాత్రంతా నానబెట్టుకున్న టీస్పూను మెంతులను నీళ్లు తీసేసి మిక్సీ జార్ లో వేయాలి. దీనికి ఆరు వేపాకులు, రెండు కీరదోసకాయ ముక్కలు జోడించి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ముల్తానీ మట్టి, అర టీస్పూను నిమ్మరసం వేసి చక్కగా కలిపి, ముఖానికి పూతలా వేసుకుని ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత చేతులని తడిచేసుకుని ఐదు నిమిషాలపాటు మర్దన చేసి చల్లటి నీటితో కడిగేయాలి. • వారానికి ఒకసారి క్రమం తప్పకుండా ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం మీద అసహ్యంగా కనిపిస్తోన్న రంధ్రాలు, డార్క్ సర్కిల్స్, మొటిమల తాలుకు మచ్చలు పోయి ముఖం చర్మం బిగుతుగా మారి, మృదువైన నిగారింపుని సంతరించుకుంటుంది. • మెంతుల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఏజింగ్ గుణాలు ముఖ చర్మానికి తేమనందించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.



యూత్ పల్స్

Vక్టరీ కోడ్

యాపిల్ వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (డబ్ల్యూడబ్ల్యూడీసీ) కొద్దిరోజుల క్రితం కాలిఫోర్నియాలోని యాపిల్ పార్క్‌లో మొదలైంది. యువతలోని టెక్ ప్రేమికులకు ఇది పండగలాంటి బిగ్ ఈవెంట్. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ మార్పులకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవడం ఒక కోణం అయితే, 'డబ్ల్యూడబ్ల్యూడీసీ'లో పాల్గొనే అవకాశం సొంతం చేసుకున్న 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల మాటలతో స్ఫూర్తి పొందడం మరో కోణం...

సాంకేతిక దిగ్గజం 'యాపిల్' ప్రతి సంవత్సరం స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ నిర్వహిస్తుంది. 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్-2021' విజేతలలో న్యూజెర్సీకి చెందిన అభినయ దినేష్ ఒకరు. భారతీయ మూలాలు ఉన్న అభినయ పదిహేను సంవత్సరాల వయసులో 'గ్యాస్ట్రో ఎట్ హోమ్' అనే యాప్‌ను క్రియేట్ చేసింది. జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధ పడేవారికి అవసరమైన సమాచారానికి ఉపకరించే యాప్ ఇది.

'అనుకున్న ఐడియాను యాప్‌గా రూపొందించడం అనేది కష్టంతో కూడుకున్న పని' అంటోంది అభినయ.

భారతీయ మూలాలు ఉన్న అవితా విజయ్ (ఆస్ట్రేలియా) తొమ్మిదేళ్ల వయసులోనే యాపిల్ 'డబ్ల్యూడబ్ల్యూడీసీ-2016' విజేతలలో ఒకరిగా నిలిచింది. యాపిల్ ఐఫోన్, ఐపాడ్‌ల కోసం యాప్స్‌ను క్రియేట్ చేసింది.

'కోడింగ్ అనేది చాలా కష్టం' అంటూనే కోడింగ్‌పై అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తోంది.

గత సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల జాబితాలో జస్కరన్ సింగ్, గీతాన్ష్ ఆత్రే, సుయాష్‌లు ఉన్నారు. పదమూడు సంవత్సరాల వయసులో సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని గీతాన్ష్ కోడింగ్ జర్నీ మొదలు పెట్టాడు.



ఈ సంవత్సరం విజేతలలో...

ఇండోర్ (మధ్యప్రదేశ్)కు చెందిన అస్మీ జైన్ ఒకరు. ఇరవై సంవత్సరాల అస్మీ జైన్ యూజర్ ఐ మూమెంట్స్‌ను ట్రాక్ చేసే యాప్‌ను డిజైన్ చేసింది. కంటిసమస్యలు ఎదుర్కొనే వారికి ఉపయోగపడే యాప్ ఇది. వైద్యరంగానికి అవసరమయ్యే యాప్‌లను తయారు చేయాలనేది అస్మీ లక్ష్యం.

'నా ప్యాషన్‌ను ప్రపంచంతో షేర్ చేసుకోవడానికి కోడింగ్ అనేది ఒక సాధనంలా ఉపయోగపడుతుంది' అంటుంది అస్మీ.

ఇరవై అయిదు సంవత్సరాల మార్త మైఖేల్‌కు పురాజీవశాస్త్రం అంటే ఇష్టం. ఇటలీ నేపుల్స్ నగరంలోని 'యాపిల్ డెవలప్‌మెంట్ అకాడమీ' స్టూడెంట్. ఈ సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతలలో మార్త ఒకరు.

మెమొరీ గేమ్ యాప్ ప్లేగ్రౌండ్‌కు రూపకల్పన చేసిన మార్త 'ఇతరులతో నా భావాలను పంచుకోవడంలో, కొత్తదారులు వెదుక్కోవడంలో కోడింగ్ నాకు ఉపయోగపడింది' అంటుందామె.

జంతుసంరక్షణ, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన యాప్‌లను రూపొందించాలనేది ఆమె భవిష్యత్ లక్ష్యం.

'డబ్ల్యూడబ్ల్యూడీసీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడమే ఒక అదృష్టం అంటే అంతకంటే అదృష్టం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన అసాధారణమైన స్టూడెంట్స్‌తో మాట్లాడే అవకాశం రావడం. వారి ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు' అంటుంది చైనీస్ స్టూడెంట్ ఝూంగ్.

'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్-2021' విజేతలలో ఝూంగ్ ఒకరు.

మెషిన్ లెర్నింగ్, ఏఆర్ చిత్రాలు, సంగీతాలను మిళితం చేస్తూ 'సీ యువర్ స్పోర్ట్స్' అనే ప్రాజెక్ట్‌కు సొంతంగా రూపకల్పన చేసింది ఝూంగ్.

'గత రెండు సంవత్సరాలుగా స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ విన్నర్స్ గురించి తెలుసుకోవడం ఆసక్తిగా మారింది. వారి మాటలు నాకు ఎంతో స్ఫూర్తిని ఇస్తాయి' అంటుంది బెంగళూరుకు చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ శ్రీరాగ.

నిజానికి ఇది శ్రీరాగ మాటే కాదు... తమ వయసులో ఉన్నవారి విజయాల నుంచి స్ఫూర్తి పొంది తాము కూడా ఏదైనా సాధించాలనుకునే యువతరం మనసులోని మాట.

సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

యాపిల్ వారి స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్‌లో పాల్గొనడానికి అతీతశక్తులు అవసరం లేదు. ఆసక్తి, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. 'కోడింగ్'ను ఇష్టపడే యువతరానికి ఇదొక గొప్ప అవకాశం. 'కోడింగ్‌పై ప్యాషన్ ఉంటే చాలు టాపిక్ మీ ఇష్టం' అంటుంది యాపిల్. ఈ చాలెంజ్‌లోని విజేతలకు బహుమతులు, యాపిల్ డెవలపర్ ప్రోగ్రామ్‌లో సంవత్సర కాల సభ్యత్వం ఒక విషయం అయితే ప్రపంచవ్యాప్త గుర్తింపు అనేది పెద్ద విశేషం. విజేతల విజయాలు వారికి మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది యువతకు స్ఫూర్తిని ఇస్తున్నాయి. 'నేనెందుకు ప్రయత్నం చేయకూడదు' అని సాధన మొదలు పెడుతున్నారు. సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

సౌండ్ హీలింగ్

ధ్వనితో చేయొచ్చు చికిత్స

మానసిక ప్రశాంతతకూ, ఒత్తిడి దూరం కావడానికీ సంగీతం ఒక సాధనం అని తెలుసు. కాని 'సౌండ్ హీలింగ్' వేరు. కచ్చితమైన పౌనఃపున్యం దగ్గర ధ్వని తరంగాలను సృష్టిస్తే అవి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా సాంత్వన కలిగిస్తాయని చెబుతోంది డాక్టర్ అంజు శర్మ. సౌండ్ హీలింగ్ కోసం ఆమె నిర్వహిస్తున్న శిబిరాలు మంచి ఆదరణ పొందుతున్నాయి.



'మీరు కారులో వెళుతున్నారు. వెనుక నుంచి ఎవరో అదే పనిగా హార్న్ కొడుతున్నారు. మీకు కోపం వస్తుందా రాదా? మీరు అదే కారులో ప్రయాణిస్తున్నారు. లోపల ఇష్టమైన పాట వస్తోంది. మీ మూడ్ హాయిగా ఉంటుందా లేదా? అంటే మీరు ఏది వింటున్నారో అది మిమ్మల్ని రోగగ్రస్తం చేయగలదు... ఆరోగ్యవంతం చేయగలదు. ఏది వింటున్నాం, ఏది అంటున్నాం అనే దాని మీద దృష్టి పెడితే మీ చెవులకు చేరుతున్న ధ్వనులు, మీ గొంతు నుంచి వెలువడుతున్న ధ్వనులు... వీటిని మంత్రమయం, సంగీతమయం, శుభమయం, శాంతిమయం చేసుకుంటే మీరు మానసికంగా, భౌతికంగా, ఉద్వేగపరంగా సమతులంగా జీవించగలరు' అంటోంది డాక్టర్ అంజు శర్మ.

దేశంలో 'సౌండ్ ఎనర్జీ మాస్టర్'గా జనం ఆరోగ్యం కోసం పని చేస్తున్న అతి తక్కువ మహిళల్లో అంజు శర్మ ఒకరు. ఈమె సౌండ్ థెరపీ ద్వారా అంటే రకరకాల పౌనఃపున్యాలు వెలువరించే పరికరాల ద్వారా ధ్వనులు వినిపిస్తూ మెదడుకు, శరీరానికి తరంగాలు పంపుతూ శరీరం లోపలి అసమతుల్యతను, అపభ్రంశతను తొలగిస్తోంది.

శబ్ద ఔషధం

'మిమ్మల్ని ఎవరో తిట్టారు. ఆ తిట్టిన మాటను మీరు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. అంటే ఆ శబ్దం మీ శరీరంలోకి వెళ్లిపోయింది. నెగెటివ్ ఎనర్జీలాగా ఉండిపోయింది. అదే మీరు ఒక మంచి మంత్రం విన్నారు. ఆశీర్వాదం విన్నారు. లేదంటే ఆలయ గంట విన్నారు. ఆ శబ్దాలు మీ లోపలికి వెళ్లాయి. అవి పాజిటివ్ ఎనర్జీగా పని చేస్తాయి. మాత్ర లోపలికి పోతే ఎలా ఔషధంగా పని చేస్తుందో శబ్దం మీ చెవి ద్వారా లోపలికి పోతే ఔషధంగా పని చేస్తుంది. సౌండ్ థెరపీలో ప్రకృతిలో వినవచ్చే శబ్దాల ద్వారా, సంగీత పరికరాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా, మానవ కంఠాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా స్వస్థత పరుస్తాం' అని తెలుపుతోంది అంజు శర్మ.


▼ 'సౌండ్ హీలింగ్' చేస్తున్న డాక్టర్ అంజు శర్మ ▲


నీటి సవ్వడి

'మనం పారుతున్న నీటి సవ్వడి వింటే ఆస్వాదిస్తాం. వాన శబ్దం విన్నా హాయిగా ఉంటుంది. ఎందుకు? మన శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. నీటి శబ్దం శరీరంలో రిథమ్ కోల్పోయిన నీటి కణాలను మళ్లీ రిథమ్‌లోకి తెస్తుంది. అందుకే ఎప్పుడైనా మానవ సంబంధాలతో వచ్చే స్ట్రెస్‌లో ఉంటే గనగ నీటి శబ్దం వినాలి. సాంత్వనం లభిస్తుంది' అని చెబుతుంది ఆమె. అప్పుడప్పుడు ప్రకృతిలోకి వెళ్లి ధ్యానం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిదని చెబుతుందామె. 'ప్రకృతిలో వచ్చే శబ్దాలు ఒకవైపు మీ చెవిన పడుతుంటే ధ్యానం వల్ల మీరు మౌనాన్ని సాధన చేస్తుంటే మీ మనసు శరీరాలు ఎంతో ఓదార్పు పొందుతాయి' అంటుందామె. గృహిణులు ఇంట్లో పనులు చేసుకుంటున్నప్పుడు ఏదో ఒక ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాన్ని వినడం మంచిదని అంటుంది అంజు శర్మ. 'సీరియల్స్‌లో వినిపించే కలుషిత శబ్దాల కుట్రల డైలాగులు మీ లోపలికి వెళ్లి ఎలాంటి అనారోగ్యం కలిగిస్తాయో మీరు తెలుసుకోవాలి' అని హితవు చెబుతుంది.

కూనిరాగాల మేలు

'కొందరు కూనిరాగాలు తీసుకుంటూ పని చేసుకుంటారు. వయసు మళ్లిన వాళ్లకు కూనిరాగాలు దివ్య ఔషధంలా పని చేస్తాయి. కూనిరాగాలు శాంతిని కలుగచేస్తాయి. అలాగే అప్పుడప్పుడు చప్పట్లతో ధ్వని పుట్టించి వింటే మంచిది' అని తెలిపిందామె. 'మన శరీరంలో ప్రతి అణువుకు కంపించే శక్తి ఉంది. బయటి నుంచి వినే ధ్వనులు ఆ కంపనాలకు హాయిని కలిగించి అనుసంధానం కాగలిగితే రోగ కారక కణాలు ఏర్పడవు' అని తెలుపుతోంది అంజు శర్మ.